సిద్దిపేట సంగారెడ్డి మెదక్

బుధవారం 11-3-2026 పేజీలు : 8



- రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లతో భారీగా మట్టి తరలింపు... అస్తిత్వం కోల్పోతున్న కొత్తచెరువు
- గోరంత అనుమతులు కొండంత తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- కళ్ళు మూసుకున్న ఇరిగేషన్ శాఖ

7 లో..





# బామ్మర్దియా.. మజాకా..

## ప్రైవేట్ కంపెనీకి రూ. 6కోట్ల మొరం మట్టి డీల్

బామ్మర్దియా... మజాకా అంటే ఇదేనేమో..! ఒక నియోజకవర్గ ప్రజాప్రతినిధి బామ్మర్ది కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు కంపెనీకి దాదాపు రూ.6 కోట్ల విలువైన మొరం మట్టిని అందజేసేందుకు "డీల్" కుదురుచుకున్నాడు. ఈడిల్ సక్సెస్ అయ్యేందుకు సదాశివపేట పట్టణ పరిధిలోని కొత్తచెరువును ఎంపిక చేసుకున్నాడు. నియోజకవర్గ ప్రజాప్రతినిధితో సంబంధిత శాఖల అధికారులకు లైన్ కలిపాడు. పలు శాఖల అధికారులను ప్రసన్నం చేసుకున్నాడు. ఏదో తూతూ మంత్రపు తవ్వకాలు అన్నట్టుగా మైనింగ్ శాఖ నుండి అనుమతులు తెచ్చుకొని కొత్త చెరువులో భారీ జెసిబిలను పదుల సంఖ్యలో భారీ టిప్పర్ లారీలను దింపాడు. ఇంకేముంది రాత్రి -పగలు తేడా లేకుండా సదాశివుని కుంట కొత్త చెరువులో భారీ త్రవ్వకాలు ప్రారంభించాడు. చంబల్ లోయలను తలపించేలా జెసిబి లతో కొత్తచెరువును లోతుగా తవ్వేస్తూ మొరం మట్టి ని ప్రైవేటు కంపెనీ నిర్మాణానికి తరలిస్తున్నాడు.

6 లో..

-ఐదుగురిని అరెస్ట్ చేసిన హావేలీఘనపూర్ పోలీసులు

-మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మెదక్ డియస్పి ప్రసన్న కుమార్

## డబ్బుల కోసం మగ శిశువును అమ్మిన ఘటన





## చెత్త సమస్యకు చెక్

### తూప్రాన్‌లో మున్సిపల్ ప్రత్యేక డ్రైవ్

7 లో..

-తూప్రాన్‌ను స్వచ్ఛంగా మార్చే దిశగా మున్సిపాలిటీ ముందడుగు

-తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవీందర్ గౌడ్

## పోటీ ప్రపంచంలో విద్యార్థులను అన్ని రంగాల్లో దీటుగా ఎదుర్కొనే శక్తి ఉండేలా
## ఈ తక్షిల విద్యార్థులకు శిక్షణ కనులకు విందు ఎంతో పసందు వైభవంగా 4వ వార్షికోత్సవవేడుకలు

**- కరస్పాండెంట్ శరత్ కుమార్**






**నారాయణఖేడ్ మార్చి 10 ప్రజా జ్యోతి :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని ఈ తక్షిల విద్యాలయంలో నాలుగో వార్షికోత్సవం అంగారంగా వైభవంగా కన్నులకు చూడముచ్చటగా, ఎంతో ఆనందంగా ఈ తక్షిల పాఠశాల ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వల తో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ తక్షిల కరస్పాండెంట్ శరత్ కుమార్ మాట్లాడుతూ.....పోటీ ప్రపంచంలో విద్యార్థులను అన్ని రంగాల్లో దీటుగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు పొందే విధంగా అక్షర జ్ఞానం నేర్పుతున్నామన్నారు. అన్ని రంగాల్లో ఎదగడానికి ఈ తక్షిల విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు . కనులకు విందు ఎంతో పసందుల, వైభవంగా 4వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని కరస్పాండెంట్ శరత్ కుమార్ తెలిపారు. విద్యార్థి దశ దిశ మార్చే శక్తి సామర్థ్యాలు ఉపాధ్యాయులకే సొంతం అన్నారు. ఈ కార్యక్రమం లో యాంకరింగ్ లో దీపిక, తన్విన్, యువరాజ్ లు విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రేక్షకులకు తన పదునైన మాటలతో ప్రేక్షకులకు అందరిని నవ్విస్తూ విద్యార్థులను ఉత్తేజపరుస్తూ కార్యక్రమం విజయవంతం కావడానికి కర్త,కర్మ, క్రియ అన్ని తామై ప్రేక్షకుల మధ్యలో మాటలు కలుపుతూ.., ఎంతో ఉత్తేజపరిచరు. దేశంలో బాలికలకు విద్య అవసరమని, సమాజంలో విద్యార్థులు ఎలా ఎదగాలని, దేన్ని స్వీకరించాలని, భక్తి మార్గం పెంపొందించే విధంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ రోజుల్లో దిగజారుతున్న మానవత విలువలను సభ్య సమాజానికి విద్యార్థుల ద్వారా నృత్య, నాటిక, వివిధ రూపాలలో ఈ తక్షిల పాఠశాలల్లో ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.ఈ తక్షిల పాఠశాలపై సమాజంలో విశ్వాసం బలపడుతుందని పేర్కొన్నారు.విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని చెప్పారు. వార్షికోత్సవాల వంటి వేదికలు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసే అవకాశమని తెలిపారు. ఈ పాఠశాలలపై సమాజంలో నమ్మకం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ పాఠశాలను ముందుకు నడిపిస్తున్న కరస్పాండెంట్ శరర్ కుమార్, ఉపాధ్యాయ బృందం కు విద్యార్థి తల్లి దండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. నృత్యలు దేశభక్తి సంస్కృతి కార్యక్రమలు చూసి విద్యార్థి తల్లిదండ్రులు మై మరచిపోయినరు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్తులు తల్లిదండ్రులు ప్రేక్షకులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలింపు చేస్తే కఠిన చర్యలు

**-ఉప్పలింగాపూర్‌లో భారీ ఇసుక డంపులు సీజ్-రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, నర్సింగ్ రావు**



**వెల్దుర్తి ప్రజాజ్యోతి మార్చ్ 10:** వెల్దుర్తి మండలం ఉప్పలింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమంగా తరలించి నిల్వ చేసిన ఇసుక నిల్వలు బయటపడిన ఘటన కలకలం రేపింది. గ్రామస్తులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న వెల్దుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ మరియు ఆర్ఐ నర్సింగరావు గ్రామానికి చేరుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా భారీ మొత్తంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు గుర్తించడంతో అధికారులు వెంటనే వాటిని సీజ్ చేసి తదుపరి చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల పేరుతో, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను తరలించడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇసుక రవాణా లేదా నిల్వ చేయాలంటే తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు ఉండాలని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలింపులు జరిగితే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

## మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి 1,50,000/- సొంత నిధులతో బోర్ వేయించిన సర్పంచ్ అనంత్ రెడ్డి



**కొండాపూర్ ప్రజా జ్యోతి :** గుంతపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని లక్ష్యంగా సర్పంచ్ అనంత్ రెడ్డి ముందడుగు వేశారు. తన సొంత నిధులతో రూ. 1.50 లక్షల వ్యయంతో బోర్ వేయించి మోటార్ ఫిట్టింగ్ చేయించి నీటి సౌకర్యం కల్పించారు. భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. మహిళల అభివృద్ధి గ్రామ అభివృద్ధి కోసం అన్ని సౌకర్యాలతో సమైక్య భవనాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, డ్వాక్రా మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే సమాజ వికాసం

**- ఏపిఎం సంగమేశ్వర్**



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి):** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే వ్యవస్థ బలోపేతం అవుతుందని ఏపీఎం సంగమేశ్వర్ అన్నారు. నర్సాపూర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపునకు నాంది మహిళలేనని, స్త్రీ మూర్తి గౌరవించబడే చోట శుభాలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ సీఆర్పీలు మేఘన, షహనాజ్ మహిళా సంఘాల బలోపేతం, పారదర్శకమైన పుస్తక నిర్వహణపై అవగాహన కల్పించారు. పాటల పోటీలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి, విజేతలకు బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు ప్రవీణ, రవీందర్, నర్సింలు, దేవిసింగ్, మల్లేశం, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులయ్యారు



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి):** పుస్తకాలు పట్టే చేతులు.. సుద్దముక్కలు పట్టాయి! పాఠాలు వినే చిన్నారులు.. పాఠాలు బోధించారు! నారాయణపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'స్వయం పరిపాలన దినోత్సవం' వినూత్నంగా సాగింది. తరగతి గదుల్లో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి వారికి పాఠాలు చెబుతుంటే.. అసలు సిసలు గురువులు మురిసిపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా మహేశ్వరి బాధ్యతలు నివహించగ, ఉపాధ్యాయులుగా రిథిక, నిహారిక, శ్రావ్య, శ్రావణి, లోకేష్, వర్షిత్, నిశాంత్, వరునిక, దివ్య, కీర్తిలు విద్యాబోధన చేశారు. క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు కృష్ణ, సురేఖ పాల్గొని చిన్నారుల ప్రతిభను కొనియాడారు.

## సావిత్రి భాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన

**- ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం**



**జహీరాబాద్, మార్చ్ 10(ప్రజా జ్యోతి న్యూస్):** సావిత్రి బాయి పూలే గారి వర్ధంతి సందర్భంగా ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం మంగళవారం కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి సావిత్రి భాయి పూలే గారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించి వర్ధంతిని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వై.నరోత్తం మాట్లాడుతూ... ఆడబిడ్డల చదువు కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన గొప్ప చైతన్య మూర్తి,సామాజిక ఉద్యమ కారిణి సావిత్రి భాయి పూలే గారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మనమందరం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు స్వామి దాస్,రాచన్న,శివ కుమార్, యస్. గోపాల్, జి.మల్లేశం, భూమ్ రెడ్డి, యస్. వెంకట్, చెంగల్ జైపాల్,సంగన్న,యం.జైపాల్,శ్రీనివాస్, లాజర్,తదితరులు పాల్గొన్నారు

# సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**జహీరాబాద్, మార్చ్ 10(ప్రజా జ్యోతి న్యూస్):** ఆత్మనిర్భర్ మహిళా యోజన జహీరాబాద్ విశ్వ మాంగళ్య మహాసభ కోఆర్డినేటర్ హస్బి పూర్ణిమ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయ్ పూలే దేశపు తొలి మహిళా ఉపాధ్యాయు రాలు, మహానీయ సామాజిక సంస్కర్తగా చేసిన సేవలను స్మరించారు. మహిళా విద్యా సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం, ప్లేగు బాధితులను సేవిస్తూ ప్రాణత్యాగం చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ఆమె ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



# కొండాపూర్‌లో పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**కొండాపూర్ ప్రజా జ్యోతి:** కొండాపూర్ గ్రామంలోని ఎంపీపీస్ కొండాపూర్ పాఠశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కొండాపూర్ గ్రామానికి చెందిన శ్రీ రొకటి రత్నయ్య గారి శ్రీమతి కీ.శే మేరీ రత్నయ్య జ్ఞాపకార్థంగా విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వారి కుమారుడు, ఎంపీపీస్ ఊట్ల ఉపాధ్యాయుడు అయిన ప్రదీప్ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్లేట్లు అందజేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దశరథ్ , కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఎలిజిబెత్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శంగా నిలుస్తుందని వారు తెలిపారు.




# ప్రజా పాలనలో భాగంగా మినీ వాటర్ ట్యాంక్ శుభ్రపరచి నూతన నల్లల బిగింపు పనులు

**శివ్వంపేట ప్రజాజ్యోతి మార్చ్ 10:** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శివ్వంపేట మండల కేంద్రంలోని రెండో వార్డులో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మినీ వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి, నూతన నల్లల బిగింపు పనులను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి రమాదేవి పర్యవేక్షించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మినీ వాటర్ ట్యాంక్‌ను పూర్తిగా శుభ్రపరచి, నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచేందుకు కొత్త నల్లలను అమర్చే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెండో వార్డ్ మెంబర్ ఇసారపు ప్రభావతి రాజు గౌడ్ మాట్లాడుతూ వార్డులోని ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ తరఫున ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని మినీ వాటర్ ట్యాంక్ శుభ్రపరిచే పనులు నిర్వహించారు. స్థానిక ప్రజలు కూడా పాల్గొని గ్రామపంచాయతీ చేపట్టిన ఈ చర్యలను అభినందించారు.



# పాడిరైతులకు నష్టం చేసే భారత్ అమెరికా ఒప్పందాలు రద్దుచేయాలి

**-కొండాపూర్లో సిపిఐ రైతు సంఘం నిరసన-రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సభ్యుడు సిహెచ్. దశరథ్**

**కొండాపూర్ ప్రజా జ్యోతి:** పాడి పరిశ్రమ ఉత్పత్తులను దెబ్బతీసేలా మోడీ సర్కార్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్తో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్. దశరథ్ అన్నారు. మంగళవారం పాడి పరిశ్రమ ఉత్పత్తులు దెబ్బతినేలా మోడీ సర్కార్ ట్రంప్ చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన కొండాపూర్ సెంటర్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దశరథ్ జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్రెడ్డితో కలిసి మాట్లాడుతూ పాడి పరిశ్రమ ఉత్పత్తులు మొక్కజొన్న, సోయాబిన్, మరెన్నో దేశ ఉత్పత్తులు దెబ్బతినేలా కేంద్రంలోని మోడీ సర్కార్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసుకున్న ఒప్పందాలను ప్రధాన మంత్రి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని పాడిపరిశ్రమ రైతులకు అన్యాయం చేయడానికి మోడీ సర్కార్ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. అమెరికా లో రైతులకు ఆదేశ ప్రభుత్వం 50శాతం సబ్సిడీ




అందజేసి భారత్కు సరఫరా చేసేందుకు సహకరిస్తుందన్నారు. అమెరికా నుండి ఎగుమతులకు ఎలాంటి సుంకాలు విధించక పోవడంతో భారత్లోని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. అమెరికాతో భారత్ చేసుకున్న ఒప్పందాలతో ర్థికంగా నష్టపోవడమే కాకుండా రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రవికాంత్, బాల్ రాజ్, వీరమ్మ, సుభాన్, నత్తయ్య, పాపయ్య. రామస్వామి, మహేష్, సుక్కమ్మ, సుజాతలున్నారు.

# పారిశుధ్యమే లక్ష్యంగా 'ప్రగతి ప్రణాళిక'

**- ముమ్మరంగా 5వ రోజు ప్రజాపాలన**

**నర్సాపూర్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న '99 రోజుల ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. మంగళవారం నాటికి ఈ కార్యక్రమం 5వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ నేతృత్వంలో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం నడుం బిగించింది. పట్టణంలోని ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారించిన సిబ్బంది, హైదరాబాద్ – నర్సాపూర్ రోడ్డు జంక్షన్ వద్ద, అలాగే మెదక్ రోడ్డులోని ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేశారు. పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని చైర్ పర్సన్ పేర్కొన్నారు. **ఇనుప చువ్వలతో రక్షణః**మురుగు నీరు సాఫీగా సాగడానికి కాలువల్లో చెత్త చేరకుండా అధికారులు వినూత్న చర్యలు చేపట్టారు. కాలువల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వెళ్లకుండా



అడ్డుకట్ట వేసేందుకు 'ఇనుప జల్లెడలు' ఏర్పాటు చేశారు. దీనివల్ల డ్రైనేజీలు బ్లాక్ అవ్వకుండా ఉంటాయని అధికారులు వివరించారు. మున్సిపల్ కమిషనర్ రామ్ చరణ్ రెడ్డి పనులను స్వయంగా పర్యవేక్షించారు. సానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, వార్డు అధికారులు మున్సిపల్ సిబ్బంది పనులను పూర్తి చేశారు.

# ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**-అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు-తహసిల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి ఝాన్సీ**



**వెల్దుర్తి ప్రజాజ్యోతి మార్చ్ 10:** వెల్దుర్తి మండల పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియా ఎరువుల సరఫరా కొనసాగుతున్నట్లు వ్యవసాయ అధికారి ఝాన్సీ తెలిపారు. మంగళవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్ తో కలిసి అధికారులు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలు, విక్రయ రికార్డులను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ఇందులో భాగంగా అధికారులు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉమ్మడి మండల పరిధిలో సుమారు 16,800 యూరియా బస్తాలు రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. రైతులు ప్రధానంగా ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా యూరియా తీసుకుంటున్నారని, అందరికీ సరిపడా ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమయానికి యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. ఎవరైనా యూరియాను అధిక ధరలకు విక్రయించినట్లయితే వారి పై కఠిన చర్యలు తప్పవని అధికారులు గట్టిగా హెచ్చరించారు.

# మల్కాపూర్ అభివృద్ధి పనులు చూసి ప్రశంసించిన శ్రీలంక బృందం

### గ్రామ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్



**తూప్రాన్ ప్రజాజ్యోతి మార్చ్ 10:** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామాన్ని మంగళవారం శ్రీలంక దేశానికి చెందిన ప్రజా ప్రతినిధుల బృందం సందర్శించింది. ఎన్ఐఆర్డీ (చీ×=ణ) ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందం గ్రామంలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ గ్రామ అభివృద్ధి గురించి వారికి వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, రాక్ గార్డెన్, డంపింగ్ యార్డ్ వంటి పలు అభివృద్ధి పనులను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే గ్రామంలోని అంగన్వాడీల పనితీరు, జిల్లా పరిషత్ హైస్కూల్ మరియు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న బెనిఫిట్స్ గురించి వివరాలు తెలుసుకున్నారు. గత కొన్నేళ్లలో మల్కాపూర్ గ్రామం అంచెలంచెలుగా అభివృద్ధి చెంది ఆదర్శ గ్రామంగా మారిన తీరును చూసి శ్రీలంక ప్రజా ప్రతినిధుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం వారు తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయాన్ని కూడా సందర్శించి అధికారుల పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్, ఎన్ఐఆర్డీ ప్రతినిధి ఆశాలత, ఎంపీడీవో సతీష్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు సురేష్, సత్యం, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు పిట్ల వేణు, జిన్న కృష్ణ, రేఖ, మన్నె తిరుపతి, సరితా పరమేష్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, మేకిన్ యువత, అంగన్వాడి టీచర్లు స్వర్ణలత, లావణ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నూతనంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులకు ఘన సన్మానం



**జహీరాబాద్, మార్చ్ 10(ప్రజా జ్యోతి న్యూస్):** తెలంగాణ ఎరుకల రాష్ట్ర సంఘం ఆదేశాల అనుసారం సంగారెడ్డి జిల్లా ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలో నూతనంగా ఎన్నుకోబడిన ఎరుకల కౌన్సిలర్లకు, సర్పంచులకు, వార్డ్ మెంబర్లకు సంగారెడ్డి జిల్లా బైపాస్ లో ఉన్న ఆయోగ భవనంలో జిల్లా సమావేశం ఏర్పాటు చేసి, ఎరుకల ప్రజా ప్రతినిధులైన కౌన్సిలర్ కిషన్ అన్నారం. కౌన్సిలర్ నర్సింలు సదాశివపేట్, కౌన్సిలర్ శ్రీకాంత్ కోహీర్, మరియు సర్పంచ్, వార్డ్ మెంబర్లకు సంఘ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుతాడి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద్లాపురం గోపాల్, రాష్ట్ర సలహాదారులు కెంపుల రాజు ఆధ్వర్యంలో నిమ్మల కిష్టయ్య గారిని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షు లుగా మరియు జిల్లా ఇన్చార్జిగా ఎన్నుకొని ప్రశంస పత్రం అందజేయడం జరిగింది. అదే విధంగా రాష్ట్రకార్యదర్శిగా కెంపుల తుల్జారాం ని, జిల్లా ఉపాధ్యక్షులుగా రాములుని, జిల్లా ఎరుకల యూత్ ప్రధాన కార్యదర్శిగా జగన్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సారోళ్ల యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సార్ల రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, విట్టల్, రాములు ,జిల్లా కోశాధికారి మహేష్, రాష్ట్ర ఎరుకల యూత్ అధ్యక్షులు కుతాడి విశ్వనాథ్,జిల్లా ఎరుకల యూత్ అధ్యక్షులు సంతోష్ ,కుల పెద్దలు రిటైర్డ్ ఎస్సై అంజన్న, పోషన్న , మానయ్య, ప్రవీణ్, బక్కన్న, శివన్న, నరేందర్, ఎరుకల కులస్తులు, యువకులు, బంధు మిత్రులు పాల్గొని, నూతనంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు, నూతనంగా ఎన్నుకో బడిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# ప్రజాపాలనలో భాగంగా శివ్వంపేటలో ఆర్డీవో రామకృష్ణ ఆకస్మిక తనిఖీ



**శివ్వంపేట ప్రజా జ్యోతి మార్చ్ 10:** మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన శివ్వంపేటలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ డివిజన్ ఆర్డీవో రామకృష్ణ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. అలాగే గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తూ వాటి నాణ్యత,పురోగతిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను కూడా తనిఖీ చేసి రైతులకు సరైన ధరలకు ఎరువులు అందుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. తరువాత గూడూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహాన్ని సందర్శించి అక్కడి వసతులు,విద్యార్థులకు అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. హాస్టల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు,అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మంచి చదువుతో భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి చారి,ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ,శివ్వంపేట సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్,ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేశం,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాలతో నిందితుల గుర్తింపు

**-సులువుగా కేసుల పరిష్కారం**

**-జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు**





**కొల్చారం ( ప్రజాజ్యోతి ) మార్చి 10 :** సీసీ కెమెరాల వలన ప్రజల భద్రతను మరింత బలోపేతం చేస్తూ పటిష్ట భద్రతా చర్యలను చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. మంగళవారం కుల్చారం మండలంలోని ఏడుపాయల టీ జంక్షన్ నుండి 2వ బ్రిడ్జ్ వరకు మొత్తం 32 కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా కెమెరాలను ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ సీసీ కెమెరాల ద్వారా వాహనాల మరియు ప్రజల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించడం,అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలను గుర్తించడం,నేరాలను నిరోధించడం,గుర్తించడం,చట్టం-సువ్యవస్థను కాపాడడం పోలీసులకు మరింత సులభమవుతుందన్నారు .అలాగే ఈ సీసీ కెమెరాలు నేరాల దర్యాప్తు మరియు విచారణలో పోలీసులకు ఎంతో సహాయపడతాయన్నారు , తద్వారా ప్రజల భద్రత మరింత మెరుగుపడుతుంది. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి శాంతి భద్రతలను కాపాడటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ రూరల్ సి ఐ జార్జ్,అల్లాదుర్గం సీఐ రేణుకా రెడ్డి, ఎస్సై అహ్మద్ మోహినోద్దీన్, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రైతుల సంక్షేమం కోసమే వడగండ్ల కట్టు కట్టి వేయడం జరిగింది

### పిల్లుట్ల సర్పంచ్ బుర్ర మురళి గౌడ్





**శివ్వంపేట ప్రజాజ్యోతి మార్చి 10:** మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ పొలిమేరలో వడగండ్ల కట్టు నిర్మించామని గ్రామపంచాయతీ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతి సంవత్సరం రైతులు వేసిన వరి నాట్లు వడగండ్ల వానల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని గ్రామస్తుల అభిప్రాయం మేరకు గ్రామ పొలిమేరలో వడగండ్ల కట్టు నిర్మించామని చెప్పారు. గ్రామస్తుల సంక్షేమమే లక్ష్యంగా తాను సర్పంచ్గా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మురళి గౌడ్ తెలిపారు. పిల్లుట్ల గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో సర్పంచ్గా గెలిపించిన గ్రామ ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామస్తుల అభిప్రాయం మేరకు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి విషయాలను తీసుకెళ్తున్నామని చెప్పారు. రైతులు అభివృద్ధి చెందితేనే గ్రామం సుభిక్షంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. పిల్లుట్ల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజల అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తానని మురళి గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొల్ల స్వామి,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతుల భూ హక్కులను పరిరక్షిస్థాం

**పక్కగా భూ హక్కులకోసం రీసర్వే**

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**





**మెదక్ రామాయంపేట (ప్రజాజ్యోతి ) మార్చి 10 :** పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. మంగళవారం రామాయంపేట మండలం లోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాల పూర్వం నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 సంవత్సరాల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్ష ను రూపొందించడం జరిగింద న్నారు. అప్పటినుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షల్లో సమస్యలు తలెత్తయన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొంద పరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుంద న్నారు. భూమి ప్రతి రైతుకు ఒక సెంటిమెంట్ అని , భూమికోసం రైతులు పరితపిస్తూఉంటారన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు.జిల్లాలో 24 గ్రామాల్లో భూ రిసర్వే ను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్థామన్నారు. భూ రిసర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వాళ్ళు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి,ఎ .డి ల్యాండ్ సర్వే కిషన్, డి.పి ఆర్ ఓ రామచంద్ర రాజు,తహసిల్దార్ రజనీ,ఎంపీడీవో గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పై దృష్టి పెట్టండి

**99 రోజుల యాక్షన్ ప్లాన్ విజయవంతం చేయాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**





**మెదక్ టౌన్ ప్రజాజ్యోతి మార్చి 10 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో ప్రతి ఒక్కరు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. సోమవారం మెదక్ మున్సిపల్ లోని 9, 26 మరియు 27 వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ను నిర్వహించారు. 26వ వార్డులో ముత్యాలమ్మ గుడి వద్దకు అదనపు జిల్లా కలెక్టర్, లోకల్ బాడీస్ నగేష్ సందర్శించి ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించి తగు సూచనలు జారీ చేసినారు. పై వార్డులలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్ పర్సన్ శ్రీమతి కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్ పర్సన్ దొంతి నరేష్ గౌడ్ , సంబంధిత వార్డు కౌన్సిలర్లు ఇతర నాయకులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , శానిటేషన్ సిబ్బంది, ఆర్ పి లు, మరియు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# స్వర్గీయ జిన్నారం ప్రసాద్ గౌడ్ సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి



**శివ్వంపేట ప్రజా జ్యోతి మార్చి10:**
మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ జిన్నారం పెద్దగౌని ప్రసాద్ గౌడ్ ప్రజలకు అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని ప్రముఖ న్యాయవాది జి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్వర్గీయ ప్రసాద్ గౌడ్ 22వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరై స్వర్గీయ ప్రసాద్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా న్యాయవాది జి. శ్రీనివాస్ గౌడ్, గూడూరు గ్రామ సర్పంచ్ బ్యాగరి నరసయ్య, ఉపసర్పంచ్ కొత్తపేట వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ స్వర్గీయ ప్రసాద్ గౌడ్ రాత్రింబవళ్లు శ్రమించి శివ్వంపేట, గూడూరు గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు.అదేవిధంగా రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. శివకుమార్ గౌడ్ స్వర్గీయ ప్రసాద్ గౌడ్ పేరిట చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి వివిధ రకాల సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. ప్రజల హృదయాల్లో ప్రసాద్ గౌడ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గూడూరు గ్రామంలోని ప్రసాద్ గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే శివ్వంపేట శివారులోని ఆయన సమాధి వద్ద కూడా పూలమాలలు వేసి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం గూడూరు మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, ప్రస్తుత సర్పంచ్ బ్యాగరి నరసయ్య, ఉపసర్పంచ్ కొత్తపేట వెంకటేష్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాజ్యం బిక్షపతి యాదవ్, జిన్నారం పెద్దగౌని సూర్యకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గూడూరు పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.అలాగే దొంతి శివారులోని బేతని సంరక్షణ అనాథాశ్రమంలో అనాథ పిల్లలకు కూడా పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఇసుగారి మల్లేష్, భీమనపల్లి మురళి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుద్ధుల బిక్షపతి, కే. సత్యనారాయణ గౌడ్, కొత్తపేట కిషన్ గౌడ్, కొమరయ్య, కొత్తపేట రాములు గౌడ్, శెట్టిపల్లి కృష్ణ గౌడ్, చెన్నాపూర్ ఎరుకల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# సౌకర్యం కోసమే పేటలో క్యాంప్ ఆఫీస్

- దూర భారం తప్పించడానికి కోసం ఫిర్యాదులు అవసరాల కోసం
- ఇచ్చిన మాట కోసం ఒప్పుకున్న పనులు చేస్తాం- రెండు మండలాల కు 500 కరెంటు మోటార్లు బోరు వేయిస్తాను
- అందరి సమ్మతితోనే ఊరిలో రోడ్డు వెడల్పు- ఎవరికి ఇబ్బందులు కలగకుండా పరిహారం ఇస్తాం
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



**రామాయంపేట ప్రజా జ్యోతి మార్చి 10:**
మెదక్ పట్టణానికి ప్రజల అవసరాలు లబ్ధిదారుల పనుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ లాంటి కార్యక్రమాలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మెదక్ రావలసిన అవసరం లేకుండానే రామాయంపేటలో నిజాంపేట రామాయంపేట చిన్న శంకరంపేట మండలాలకు క్యాంప్ ఆఫీసును ఏర్పాటు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు ఆయన రామయంపేట పట్టణంలోని మాజీ జెడ్పిటిసి సీనియర్ నాయకుడు షరాఫ్ యాదగిరి ఇంటిలో నిర్మించిన మూడు మండలాల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును మంగళవారం ప్రారంభోత్సవం చేశాడు ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై నమ్మకం ఉంచి రామాయంపేట మున్సిపాలిటీ పట్టం కట్టినందుకు తాను కూడా చెప్పిన పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు అంతకుముందు మాట్లాడిన రామాయంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు 50 కోట్ల రూపాయల సహకారం కావాలను కోరారు గ్రామాలలో ముఖ్యంగా డ్రైనేజీ మరియు మంచినీటి సమస్యలు రోడ్డు సమస్యలు ఉన్నాయన్నారు రెండు మండలాలు ఎమ్మెల్యే పై నమ్మకం ఉంచి కార్యక్రమాలను పూర్తి చేస్తారని ప్రజలకు హామీ ఇచ్చామని ఆయన తెలిపారు. దానికి సమాధానంగా ప్రతి మండలంలోనూ ప్రతి గ్రామంలో రెండు కరెంటు మోటార్లు మరియు బోరు వేయిస్తానని మొత్తం 500 బోర్లు 500 మోటార్ ఇప్పిస్తానని ఆయన సభాముఖంగా తెలిపారు. అనంతరం రామాయంపేట మెయిన్ బజార్ రోడ్డు వెడల్పు కోసం వ్యాపారస్తులను ప్రజలను సమావేశం ఏర్పాటు చేసి చాలాసేపు వారి యొక్క ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి ఇబ్బందులు లేకుండా ఎక్కువ శాతం రోడ్డు కటింగ్ లో ఇండ్లు దెబ్బతిన్న దుకాణాలు దెబ్బతిన్న వారికి డబుల్ బెడ్ రూములు ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తిగా కమర్షియల్ దుకాణాలు నష్టపోతే మండల ప్రజా పరిషత్ లోని కొన్ని ప్రాంతాలలో సెట్రైలు వేసి ఇస్తామని చైర్మన్ లావణ్య నాగరాజు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో తెల్పడంతో కొందరు వ్యాపారస్తులు ప్రజలు తమకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని విన్నవించుకోవడంతో అందరికీ న్యాయం జరిపిస్తామని 35 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ రామాయంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పోచమ్మనవనీత గణేష్ కౌన్సిలర్ బైరం స్వప్న దేవుని రంజిత్ పుట్టి సందీప్ రవి నాయక్ దాకి శ్యామల స్వామి మైపాల్ రెడ్డి మహేందర్ రెడ్డి రమేష్ రెడ్డి అమర్ సేనా రెడ్డి వెంకటేశం గౌడ్ సిద్దరాములు చింతల స్వామి చిలుక స్వామి నజీర్ మోబిన్ ఇర్షత్ రెండు మండలాల సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సబ్సిడీ పథకాలు.. రైతులకు ఎంతో మేలు

**- కుసంగి సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్**

**టేక్మాల్ (ప్రజాజ్యోతి) మార్చ్ 10 :** మండల పరిధిలోని కుసంగి గ్రామంలో వాటర్ షెడ్ పథకంలో భాగంగా గతంలో డీడీలు కట్టిన 9 మంది లబ్ధిదారులకు 75% సబ్సిడీ ద్వారా వచ్చిన బ్యాటరీ స్ప్రేయర్లు,బ్రష్ కట్టర్లు , మంగళవారం కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతన్నలు నూతన యాజమాన్య పద్ధతులను పాటించి వ్యవసాయం చేయాలని పంట మార్పిడి చేస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను రైతన్నలు ఉపయోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్బారావు సంబంధిత అధికారులు భగవాన్ రెడ్డి,రాజశేఖర్ , రైతు ఉత్పత్తి సంఘం నాయకులు వెంకటేశం,మాజీ ఎంపీటీసీ సభ్యులు అంజయ్య,మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి,వార్డు సభ్యులు వెంకట్ గౌడ్, దుర్గయ్య,అనిల్ గౌడ్,సతీష్, నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు డాకూరి




లక్ష్మయ్య,ఎనగండ్ల మల్లేశం, పెద్దాపురం భూమయ్య,తలారి అడివయ్య,వీర రెడ్డి,కిష్టయ్య,పోల్కం శ్రీనివాస్,రవి,సాయిలు ,ఆంజనేయులు గౌడ్,గజానంద్,కిరణ్ రెడ్డి,శ్రీకాంత్,యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# డబ్బుల కోసం మగ శిశువును అమ్మిన ఘటన

**-ఐదుగురిని అరెస్ట్ చేసిన హావేలీఘనపూర్ పోలీసులు**

**-మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మెదక్ డియస్పి ప్రసన్న కుమార్**

**హావేలి ఘనపూర్ (ప్రజా జ్యోతి మార్చ్ 10:** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక నెల మగ శిశువును అమ్మిన ఘటన హావేలీఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ ఘటనలో శిశు వు తల్లిదండ్రులు, మధ్యవర్తులు, కొనుగోలు చేసిన దంపతులు సహా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.హావేలీఘనపూర్ మండలం లింగసాన్ పల్లి తాండకు చెందిన కేతావత్ మంజుల (25), ఆమె భర్త మహేష్‌లు ఒక నెల క్రితం మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మగ శిశువుకు జన్మనిచ్చారు. అయితే గత వారం రోజులుగా అంగన్వాడీ కేంద్రంలో లభించే అనుబంధ పోషకాహారం కోసం మంజుల రాకపోవడంతో అంగన్వాడీ టీచర్ ఆమె ఇంటికి వెళ్లి విచారించగా ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని ×జబూ సెక్టార్ ఇంచార్జ్ పర్ల విజయలక్ష్మికి తెలియజేశారు.ఈ క్రమంలో విచారణ జరపగా తేది 4న మెదక్ పట్టణంలోని ఒక టాకీస్ వద్ద మంజుల, మహేష్‌లు హావేలీఘనపూర్‌కు చెందిన కుమ్మరి నాగరాజు, అతని భార్య స్వప్నతో కలిసి తమ మగ శిశువును మొదట రూ.5 లక్షలకు అమ్మాలని నిర్ణయించుకుని, తరువాత రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అనంతరం హావేలీఘనపూర్ మండలం శాలిపేట గ్రామ శివారులో స్టాంప్ పేపర్‌పై రాతపూర్వకంగా ఒప్పందం చేసుకుని శిశువును వారికి అప్పగించారు.తేది 9న చేగుంట బస్ స్టాప్ వద్ద మంజుల,



మహేష్‌లను ×జబూ సెక్టార్ ఇంచార్జ్ పర్ల విజయలక్ష్మి గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసుల విచారణలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిశువును అమ్మినట్లు వారు తెలిపారు.మధ్యవర్తులైన కుమ్మరి నాగరాజు, భార్య స్వప్న ను విచారించగా, కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం కంచర్ల గ్రామానికి చెందిన తమ బంధువులు నరసొల్ల రాజు, అతని భార్య నరసొల్ల రజిత పిల్లలు లేని కారణంగా రూ.1.50 లక్షలకు శిశువును అప్పగించినట్లు వెల్లడైంది. దీంతో ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి భిక్నూర్ మండలం కంచర్ల గ్రామానికి వెళ్లి నరసొల్ల రాజు వద్ద నుంచి మగ శిశువును స్వాధీనం చేసుకుని సఖి కేంద్రంలో శిశువు తల్లి మంజులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం రిమాండ్ కు తరలిస్తామని డీఎస్పీ ప్రసన్న కుమార్ గారు తెలిపారు.

## జిఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు ప్రజా సేవకై ముందు నడవాలి కష్టాల్లో ఉన్న ప్రజలకు ఆర్థిక సాయం అందించండి

**గుల్లపు మచ్చేందర్ ఆదేశాలు**

**నారాయణఖేడ్ మర్చి 10 (ప్రజా జ్యోతి) :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మనూర్ మండలం బోరంచ గ్రామంలో పంచగామ మారుతి మరణించిన విషయం తెలుసుకున్న జి యం ఆర్ టీం ను జి యం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గుల్లపు మచ్చేందర్ ఆదేశాల మేరకు అంత్యక్రియలకు కొంత ఆర్థిక సహాయాన్ని అందించాలని జి యం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుల్లపు మచ్చేందర్ విదేశాల నుంచి ఆదేశించడం జరిగిందని, గుల్లపు మాచందర్ టీం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం లో గుల్లపు మచ్చేందర్ టీం సభ్యులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సిందోల్ సంగారెడ్డి,పాలడుగు రాములు,పుట్టి విట్టల్,ఎర్ర శ్రీశైలం, బుక షఫీ,మోట్లకుంట లింగం,గొల్ల పాపని




గోపాల్,శ్రీకాంత్ రెడ్డి, మ్యాతిరి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## తాత ఆశయం నెరవేర్చిన మనవడు

**-సిఏ గా రాణించిన మయూర్ సారడ**

**జహీరాబాద్, మార్చ్ 10(ప్రజా జ్యోతి న్యూస్):** కఠిన శ్రమ, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా ముద్దాడవచ్చు అని నిరూపించాడు జహీరాబాద్‌కు చెందిన యువకుడు మయూర్ సారడ. రాచన్నపేట్ వాస్తవ్యులైన మయూర్ సారడ, ఇటీవల విడుదలైన సిఏ ఫలితాల్లో 300 మార్కులకు గాను 190 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించారు.మయూర్ తండ్రి కీర్తిశేషులు విజయ్‌కుమార్ సారడ (టాక్స్ కన్సల్టెంట్) పదేళ్ల క్రితం అనారోగ్యంతో



మరణించారు. అప్పటి నుండి తల్లి సునీత సారడ ప్రోత్సాహంతో మయూర్ తన చదువును కొనసాగించారు. మయూర్ తాతగారైన గోవింద్ ప్రసాద్ సారడ కూడా టాక్స్ కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నారు. తమ కుటుంబం నుండి ఎవరో ఒకరు సిఏ కోర్సు పూర్తి చేయాలని ఆయనకు బలమైన కోరిక ఉండేది. తాత ఆశయాన్ని తన లక్ష్యంగా మార్చుకున్న మయూర్, పట్టుదలతో చదివి నేడు సిఏ క్వాలిఫై అయ్యారు. మయూర్ సారడ సాధించిన ఈ విజయం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయి. ఈ సందర్భంగా లిజహీరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ మయూర్ నివాసానికి వెళ్లి, ఆయనను శాలువా మరియు పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమెంటోను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణ కుటుంబం నుండి వచ్చి, తండ్రి లేని లోటును అధిగమించి, తాత ఆశయం కోసం మయూర్ పడ్డ శ్రమ అభినందనీయం. యువతకు ఆయన ఒక స్ఫూర్తిప్రదాత" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మరియు మిత్రులు పాల్గొని మయూర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సావిత్రిబాయి ఆదర్శంగా తీసుకొని మహిళలు ఎదగాలి

**ప్రజా సంఘాల నాయకులు**



**నారాయణఖేడ్ మర్చి 9 (ప్రజా జ్యోతి):** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్ అంబేద్కర్ భవనంలో ప్రజాసంఘాల నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ..... సావిత్రిబాయి పూలను ఆదర్శంగా తీసుకొని మహిళలు చదువు నేర్చుకుని అన్ని రంగాలు ఎదగాలని తెలిపారు. సావిత్రిబాయి పూలే మహిళల విద్యకు పునాది వేసిన మహనీయురాలని అన్నారు. కులమతాల పేరుతో అజ్ఞానంతో కూరుకుపోయిన సమాజానికి విద్య ద్వారా చైతన్యం తీసుకువచ్చిన గొప్ప సామాజిక సంస్కర్తగా ఆమెను గుర్తు చేసుకున్నారు.మహిళలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని సావిత్రిబాయి పూలే నమ్మకం అని, అందుకే అన్ని అడ్డంకులను ఎదుర్కొని బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించిన ధైర్యవంతురాలని పేర్కొన్నారు. ఆమె చూపిన బాటలో నడుస్తూ సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఇలాంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు తెలిపారు.

## బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహ్మద్ ఇమ్రాన్ జన్మదిన వేడుకలు




**జహీరాబాద్, మార్చ్ 10(ప్రజా జ్యోతి న్యూస్):** బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇమ్రాన్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం సమక్షంలో జన్మదిన కేక్ ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, డి.మాణిక్ ప్రభు గౌడ్, యస్.గోపాల్, చెంగల్ జైపాల్, యస్.వెంకట్, సంగన్న, శ్రీనివాస్, బి.జైపాల్, పాండు తదితరులు ఉన్నారు.

### పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన

## సబ్ కలెక్టర్.ఉమా హారతి

**కల్హేర్ 10.మార్చి. ప్రజాజ్యోతి:**



సంగారెడ్డి జిల్లా లోని నారాయణఖడ్ లోని పలు ఎగ్జామషన్ సెంటర్ లలో విద్యార్థులు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలని, ఎలాంటి కాపీ చేయకూడదని ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. మంగళవారం ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష ఎలా రాస్తున్నారో దగ్గరుండి పరిశీలించారు. సొంతంగా పరీక్షలు రాసినప్పుడే భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు. ఇన్విజేటర్లో పని తీరిపై సంతృప్తి చెందడం జరిగింది

# చెత్త సమస్యకు చెక్ - తూప్రాన్‌లో మున్సిపల్ ప్రత్యేక డ్రైవ్

**-తూప్రాన్‌ను స్వచ్ఛంగా మార్చే దిశగా మున్సిపాలిటీ ముందడుగు**

**-తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవీందర్ గౌడ్**

**తూప్రాన్ ప్రజాజ్యోతి మార్చ్ 10:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తూప్రాన్ పట్టణంలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు కాలువలు, డ్రైనేజీలను శుభ్రపరిచే పనులు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అనంతరం పెద్ద చెరువు కట్టపై వేస్ట్ కంపోస్ట్ పిట్ ఏర్పాటు చేసి చెత్త నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తూప్రాన్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. చెత్తను తడి, పొడి గా



వేరు చేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వాలని, పట్టణ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# తూప్రాన్ పరిధిలో చిరుత పులి సంచారం

**గుండ్రెడ్డిపల్లిలో లేగ దూడపై చిరుత దాడి**

**తూప్రాన్ ప్రజాజ్యోతి మార్చ్ 10:** తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామ అటవీ శివారులో చిరుత పులుల సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన చింతల శేఖర్‌కు చెందిన లేగ దూడపై రెండు చిరుత పులులు దాడి చేసి చంపి మాంసం తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే తూప్రాన్ డివిజన్ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆయనతో పాటు మండల పశువైద్య అధికారి డాక్టర్ లక్ష్మి, పశు వైద్య సహాయకులు లింగమూర్తి, గోపాలమిత్ర అశోక్ అక్కడికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు. అటవీ ప్రాంతంలో చిరుత పులి కాళ్ల ముద్రలను గుర్తించిన అధికారులు, అదే లేగ దూడపై దాడి చేసి మాంసం తిన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ లక్ష్మి లేగ దూడకు పోస్టుమార్టం నిర్వహించి నివేదికను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు. లేగ దూడ యజమాని చింతల శేఖర్ పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నందున ప్రభుత్వం



నుంచి ఆర్థిక సహాయం అందించాలని గ్రామ సర్పంచ్ యాదమ్మ కృష్ణ కోరారు. ఇటీవల అటవీ శివారుల్లో చిరుత పులుల సంచారం పెరగడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పశువులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# బామ్మర్దియా...మజాకా..!

**ప్రైవేట్ కంపెనీకి రూ. 6కోట్ల మొరం మట్టి డీల్**

**రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లతో భారీగా మట్టి తరలింపు... అస్తిత్వం కోల్పోతున్న కొత్తచెరువు**

**గోరంత అనుమతులు కొండంత తవ్వకాలు**

**చోద్యం చూస్తున్న అధికారులు**

**కళ్ళు మూసుకున్న ఇరిగేషన్ శాఖ**





బామ్మర్దియా... మజాకా అంటే ఇదేనేమో..! ఒక నియోజకవర్గ ప్రజాప్రతినిధి బామ్మర్ది కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు కంపెనీకి దాదాపు రూ.6 కోట్ల విలువైన మొరం మట్టిని అందజేసేందుకు "డీల్" కుదురుచుకున్నాడు. ఈడీల్ సక్సెస్ అయ్యేందుకు సదాశివపేట పట్టణ పరిధిలోని కొత్తచెరువును ఎంపిక చేసుకున్నాడు. నియోజకవర్గ ప్రజాప్రతినిధితో సంబంధిత శాఖల అధికారులకు లైన్ కలిపాడు. పలు శాఖల అధికారులను ప్రసన్నం చేసుకున్నాడు. ఏదో తూతూ మంత్రపు తవ్వకాలు అన్నట్టుగా మైనింగ్ శాఖ నుండి అనుమతులు తెచ్చుకొని కొత్త చెరువులో భారీ జెసిబిలను పదుల సంఖ్యలో భారీ టిప్పర్ లారీలను దింపాడు. ఇంకేముంది రాత్రి - పగలు తేడా లేకుండా సదాశివుని కుంట కొత్త చెరువులో భారీ త్రవ్వకాలు ప్రారంభించాడు. చంబల్ లోయలను తలపించేలా జెసిబి లతో కొత్తచెరువును లోతుగా తవ్వేస్తూ మొరం మట్టి ని ప్రైవేటు కంపెనీ నిర్మాణానికి తరలిస్తున్నాడు. భారీ ఎత్తున తవ్వకాలు జరుగుతున్న అక్కడికి ఏ అధికారి రావడం లేదు అనుమతుల కంటే వందల రెట్లు అధికంగా మట్టిని తరలిస్తున్న ఏ శాఖ అధికారి పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధి బామ్మర్ది డీల్ కు తగ్గట్టుగా మట్టిని తరలిస్తే కొత్తచెరువు రూపురేఖలు అధ్వానంగా మారిపోతాయని రైతులు మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

**గోరంత అనుమతులు కొండంత తవ్వకాలు...**

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని ఓ గ్రామం సమీపంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న భారీ కంపెనీ నిర్మాణానికి రూపాయలు కోట్ల విలువైన మేలురకం మొరం మట్టి అవసరం. సదరు కంపెనీతో డీల్ చేసుకున్న నియోజకవర్గ ప్రజా ప్రతినిధి బామ్మర్ది మైనింగ్ శాఖ నుండి 3000 క్యూబిక్ మీటర్ల మొరం మట్టి తరలించేందుకు రూ. ఒక లక్ష 20వేల లు ప్రభుత్వ ఖజానాకు డి.డి చెల్లించి కొత్తగా ఏర్పాటు చేస్తున్న కంపెనీ పేరుతో అనుమతులు తెచ్చుకున్నారు. అనుమతుల్లోని నిబంధనలను పాటిస్తూ చెరువు అస్తిత్వానికి ముప్పు వాటిల్లకుండా శాస్త్రీయంగా మొరం మట్టి తవ్వకాలు జరపాలి. నిర్దిష్టమైన కొలతల ప్రకారం మొరం మట్టి తవ్వకాలు ఉండాలి కానీ పట్టణంలోని కొత్తచెరువును పరిశీలిస్తే ప్రైవేటు కంపెనీ -నియోజకవర్గ ప్రజా ప్రతిని బామ్మర్ది చేపట్టిన మొరం మట్టి తవ్వకాల్లో అనుమతుల్లోని నిబంధనలకు నీళ్లు వదిలిన తీరు కళ్ళకు కడుతున్నది. బీహార్ రాష్ట్రంలోని చంబల్ లోయలను తలపించేలా ఈ మొరం మట్టి మాఫియా జరుపుతున్న తవ్వకాలు... తవ్వకాలతో ఏర్పడుతున్న భారీ లోతైన గోతులు చూస్తుంటే అసలు జిల్లాలో అధికారులు ఉన్నట్టా? లేనట్టా? అన్న సందేహం కలగక మానదు. మరో రెండు మూడు రోజుల్లో కొత్తచెరువు పరిస్థితి అధ్వానంగా మారిపోయి చెరువు అస్తిత్వం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానిక రైతులు, మత్స్యకారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చెరువు వద్దకు ఆయా శాఖల అధికారుల బృందాలను పంపి చెరువు పరిధిలో జరిగిన అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకొని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే కొత్తచెరువును కాపాడాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.